క్లుప్తంగా

పిల్లలను పనిలో పెడితే చర్యలు



అవగాహన కల్పిస్తున్న చైల్డ్‌లైన్ సిబ్బంది

ఇచ్ఛాపురం: బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని సీడబ్ల్యూసీ. గోపాలకృష్ణ హెచ్చరించారు. బాలకార్మికుల గుర్తింపు ప్రక్రియలో భాగంగా శుక్రవారం ఇచ్ఛాపురం పట్టణంలో పలు మెకానిక్ గ్యారేజీలు, షాపులు తనిఖీ చేశారు. బాలకార్మికులను ప్రోత్సహించ కూడదని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో కార్మిక అధికారి విజయ్‌కుమార్, చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది ఎం.స్వాతి, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

సంతబొమ్మాళి : ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నౌపడ సత్యసాయి మందిరంలో వృద్ధులకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. నౌపడ ఆయుర్వేద డాక్టర్ ఫణిమాధవి, సిబ్బంది బీపీ, షుగర్, తదితర వ్యాధులకు సంబంధించి 52 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఆహార నియమాలు పాటించాలని సూచనలిచ్చారు. కార్యక్రమంలో యోగా టీచర్స్ చంద్రశేఖర్, సత్తారు ఉషారాణి, సత్యసాయిబాబా కమిటీ కన్వీనర్ సీహెచ్ మురళి తదితరులు పాల్గొన్నారు.

గిరిధర్ సేవలు వెలకట్టలేనివి



గిరిధర్ దంపతుల్ని సన్మానిస్తున్న దృశ్యం

కంచిలి: భావిభారత పౌరులను తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తికి తన పదవీ కాలంలో చేసిన సేవలతో బాగ గిరిధర్ వన్నెతెచ్చారని ఎంఈఓలు ఎస్.శివరాంప్రసాద్, కె.చిట్టిబాబు పేర్కొన్నారు. కంచిలి మండలం ఎక్కల ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేసిన బాగ గిరిధర్ ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్రవారం సంస్మరణ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగ కాలంలో చేసిన సేవల్ని గుర్తుచేసుకున్నారు. అనంతరం గిరిధర్ దంపతులను దుశ్శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, ఎంఆర్సీ సిబ్బంది, గ్రామస్తులు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గొడుగుల వితరణ



గొడుగులు అందజేస్తున్న రోటరీ ప్రతినిధులు

సోంపేట: సోంపేట ఎస్సీ బాలికల వసతి గృహంలో చదువుతున్న విద్యార్థులకు సోంపేట రోటరీ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావు, మల్లా తిరుమలరావు 100 గొడుగులు, గ్లూకోజ్ ప్యాకెట్లను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా వసతి గృహ సిబ్బంది రోటరీ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు.

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం శుక్రవారం పలాస లయన్స్ హాల్‌లో ఘనంగా జరిగింది. పీడీజీ డి.ఎస్.ఎస్.వి.వర్మ ముఖ్య అతిథిగా హాజరుకాగా, ఇన్‌స్టలేషన్ అధికారిగా వీడీజీ కె.వి.సుబ్బరాజులు ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షుడిగా హనుమంతు ఎండుదొర, కార్యదర్శిగా తమ్మినాన మాధవరావు, ట్రెజరర్‌గా నెమలిపురి అప్పారావులు బాధ్యతలు చేపట్టారు. అనంతరం మాజీలైన ఇరవై మంది సభ్యులను సత్కరించారు.

రెడ్డిక కుల సమస్యలు పరిష్కరించాలి

ఇచ్ఛాపురం: రెడ్డిక కులాన్ని సంచార, అర్ధ సంచార జాతులుగా గుర్తించి సమస్యలను పరిష్కరించాలని రెడ్డిక కుల రాష్ట్ర అధ్యక్షుడు దుక్క లోకేశ్వరరావు కోరారు. ఈ మేరకు శుక్రవారం విజయవాడలో విముక్త జాతుల అభివృద్ధి మండలి సభ్యులు భాట్‌బాయ్ బాబుబాయ్ పాట్నిని కలిశారు. కార్యక్రమంలో ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జునరావు, మహంకాళి శ్రీనివాసరావు, ఉప్పలపాటి నాగలింగం తదితరులు పాల్గొన్నారు.

● ఆపదలో అండగా..



ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలోని పురుషోత్తపురం గ్రామానికి చెందిన గాలి కృష్ణారావు కొద్దినెలల కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో కాళ్లు కోల్పోయాడు. విషయం తెలుసుకున్న కేదారిపురం గ్రామానికి చెందిన గల్ఫ్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు శుక్రవారం బాధితునికి రూ.10 వేలు సాయం అందించారు.

- ఇచ్ఛాపురం

● ప్రయాణికుల పాట్లు



పలాస నుంచి విశాఖపట్నం వెళ్తున్న ఆర్టీసీ బస్సు నందిగాం వద్ద మొరాయించడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పలేదు. బస్సును పది కిలోమీటర్ల దూరంలో ఉన్న టెక్కలి ఆర్టీసీ గ్యారేజీకి తరలించగా..ప్రయాణికులు కొందరు ఆర్టీసీ బస్సుల్లో, మరికొందరు ప్రైవేటు వాహనాల్లో వెళ్లిపోయారు.

- కాశీబుగ్గ

● సర్కారు బడుల్లోనే సకల సౌకర్యాలు



ప్రైవేటుకు దీటుగా సౌకర్యాలు కలిగిన సర్కారు బడుల్లోనే పిల్లలను చేర్పించాలని ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం మార్కండేయ బిసాయి అన్నారు. మండలంలోని ఈదుపురం(ఆర్) ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో శుక్రవారం 'బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్తు వరప్రసాద్ యాదవ్, ఉపాధ్యాయులు కె.చంద్రశేఖర్‌రెడ్డి, సీతాపతి బెహరా, భీమారావు, రామకృష్ణ, రాజేశ్వరి, పుష్పలత పాల్గొన్నారు.

- ఇచ్ఛాపురం రూరల్

కులధ్రువీకరణ పత్రాల మంజూరుకు చర్యలు

వజ్రపుకొత్తూరు/వజ్రపుకొత్తూరు రూరల్:

కుల ధ్రువీకరణ పత్రాల కోసం గతంలో దరఖాస్తు చేసుకున్న వారందరికీ వెంటనే సర్టిఫికెట్లు మంజూరు చేసేందుకు చర్యలు చేపడుతున్నామని తహసీల్దార్ ఎం.సురేష్ తెలిపారు. శుక్రవారం మండలంలోని మెట్టూరు, గుణుపల్లి, చీపురుపల్లి గ్రామాల్లో పెండింగ్ దరఖాస్తులను పరిశీలించారు. 5322 మందికి ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాల్సి ఉండగా జేసీ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి విడతల వారీగా అర్జీదారులకు అందిస్తున్నామని చెప్పా రు. నాలుగు రోజుల్లో ఆర్ఐ, వీఆర్ఓలు వీటిని పరిశీలించి తహసీల్దార్ లాగిన్‌కు పంపితే తాను తక్షణమే డిజిటల్ సైన్‌తో కుల ధ్రువీకరణ పత్రాలు అందిస్తానని తెలిపారు. అర్హులందరికీ పత్రాలు మంజూరు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ వాయిలపల్లి గిరిరాజ్, వీఆర్ఓలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



గుణుపల్లిలో కుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ సురేష్

సేవలే గుర్తింపునిస్తాయి



మోహనరావు దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ

కంచిలి: ప్రభుత్వ ఉద్యోగికి తన పదవీ కాలంలో ప్రజలకు చేసిన సేవలతోనే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. జాడుపూడి గ్రామానికి చెందిన రైల్వే ఉద్యోగి పిలక మోహనరావు ఉద్యోగ విరమణ సభను జాడుపూడి రైల్వేస్టేషన్ ఆవరణలో సహచర ఉద్యోగుల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహనరావు దంపతులను దుశ్శాలువతో సన్మానించారు. జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, వైఎస్సార్ సీపీ నేతలు ఇప్పిలి కృష్ణారావు, తడక జోగారావు, మద్దిల ఈశ్వరరావు, టీడీపీ నేతలు మాదిన రామారావు, బి.కురయ్య, టి.శోభన్‌బాబు, పి.చిన్నబాబు, ఎం.ధర్మారావు, పలాస ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ ప్రతినిధులు ఎం.రామకృష్ణ, ఎం.ఉమామహేశ్వరరావు, ఎ.రామకృష్ణ, పి.కామేశ్వరరావు, ఎల్.వెంకటరావు, బి.గాంధీ, ఆర్.దుర్యోధన పాల్గొన్నారు.

కబడ్డీ అభివృద్ధికి సహకరించండి



ఎమ్మెల్యే శిరీషను కలిసిన జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: కబడ్డీ అభివృద్ధికి సహాయ సహకరాలను అందించాలనిజిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అక్కేని చిరంజీవిరావు నేతృత్వంలో సంఘ ప్రతినిధులు, సీనియర్ క్రీడాకారులు శుక్రవారం పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషను కలిశారు. జిల్లాలో, రాష్ట్రంలో స్వార్థప్రయోజనాల కోసం ఏర్పాటైన కబడ్డీ సంఘాల ద్వారా ఎదుర్కొన్న ఇబ్బందులు, గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రక్షాళన చేయడం, కబడ్డీ క్రీడాభివృద్ధికి కావాల్సిన కనీస సౌకర్యాలు, వసతులపై చర్చించారు.

మాణిక్యపురంలో సామాజిక తనిఖీ గ్రామసభ



వివరాలు వెల్లడిస్తున్న తనిఖీ సిబ్బంది

కవిటి: మండలంలోని మాణిక్యపురం గ్రామ పంచాయతీ పరిధిలో జరిగిన ఉపాధి హామీ పథకం పనులు, సామాజిక పెన్షన్ల పంపిణీకి సంబంధించి కొన్ని రోజులుగా నిర్వహించిన తనిఖీలపై శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. రూ.62 లక్షల విలువైన 34 ఉపాధి పనులపై చర్చించారు. ఇక్కడ ఆమోదం పొందిన నివేదిక, అభ్యంతరాల్ని మండలస్థాయిలో అందించనున్నట్లు సెక్రటరీ అట్టాడ విజయ తెలిపారు.

కార్యక్రమంలో సర్పంచ్ లలిత సాహు, ఎంపీటీసీ సత్యవతి సాహు, వైస్ సర్పంచ్ దేవరాజు సాహు, ఉపాధి ఏపీఓ టి.మోహనరావు, ఇంజినీరింగ్ కన్సల్టెంట్ నీలాంబర్, గ్రామపెద్దలు బృందావన్, ఢిల్లీ మజ్జి తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సంతోష్

ఇచ్ఛాపురం: ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరికి సీపీఆర్ (కార్డియో పల్మనరీ రెససిటేషన్)పై అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ వెచ్చా సంతోష్ అన్నారు. ఇచ్ఛాపురం కేజీబీవీలో జేసీఐ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు షణ్ముఖరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. గుండెపోటు వంటి సందర్భాల్లో స్పృహ కోల్పోయిన వ్యక్తులకు సీపీఆర్ చేయడం ద్వారా ప్రాణాలు కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో జేసీఐ ప్రతినిధులు పవన్‌కుమార్, నవీన్, ఢిల్లేశ్వరరావు, రాజ్‌కుమార్, జైదేవ్, ప్రిన్సిపల్ పి.శిరీష తదితరులు పాల్గొన్నారు.

పీజీ సెట్‌లో సింహాద్రి ప్రతిభ



కుమ్మరి సింహాద్రి

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2021-24 విద్యా సంవత్సరంలో డిగ్రీ పూర్తిచేసుకున్న కుమ్మరి సింహాద్రి ఏపీ పీజీ సెట్‌లో రసాయన శాస్త్ర విభాగంలో రాష్ట్ర స్థాయిలో 10వ ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా విద్యార్థిని కళాశాల ప్రిన్సిపాల్ వెంకట లక్ష్మి, అధ్యాపకులు ఎం.తిరుపతిరావు తదితరులు అభినందనలు తెలిపారు.

అపరిశుభ్రంగా బస్ షెల్టర్



అధ్వానంగా ఉన్న కొత్తపేట బస్‌షెల్టర్

కోటబొమ్మాళి: జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న కొత్తపేట బస్‌షెల్టర్ అపరిశుభ్రంగా తయారైంది. యాచకులు రాత్రివేళల్లో నిద్రపోవడం, సామగ్రి ఇక్కడే వదిలేయడం, నిర్వహణ చేపట్టకపోవడంతో అధ్వానంగా మారి దుర్వాసన వస్తోంది. దీంతో ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. కోటబొమ్మాళి మండలానికి ప్రధాన బస్‌షెల్టర్ కావడంతో ప్రతిరోజూ వందలాది మంది ప్రయాణికులు విజయవాడ, విశాఖపట్నం, శ్రీకాకుళం వంటి ప్రాంతాలకు వెళ్లేందుకు బస్సుల కోసం ఇక్కడే నిరీక్షిస్తుంటారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నవోదయకు ఆదర్శ పాఠశాల విద్యార్థి ఎంపిక



జెర్రి సంజయ్

సోంపేట: సోంపేట ఆదర్శ పాఠశాలలో చదువుతున్న జెర్రి సంజయ్ నవోదయలో 9వ తరగతిలో ప్రవేశానికి అర్హత సాధించాడు. స్థానిక టీడీఆర్ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందిన ఈ విద్యార్థిని కళాశాల ప్రిన్సిపల్ చిన్నాజీ వర్మ, పాఠశాల సిబ్బంది, కోచింగ్ సెంటర్ సిబ్బంది, తోటి విద్యార్థులు శుక్రవారం అభినందించారు.

నేడు వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని బొడ్డఖాళీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ 21వ వార్షికోత్సవం శనివారం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం శ్రీదేవి, భూదేవి సహిత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకం అనంతరం కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దంపతులచే సామూహిక కుంకుమ పూజలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

వైస్ ఎంపీపీకి పరామర్శ



వైస్ ఎంపీపీని పరామర్శిస్తున్న నాయకులు

ఇచ్ఛాపురం రూరల్: వైస్ ఎంపీపీ, వైఎస్సార్ సీపీ నాయకుడు దువ్వు వివేకానందరెడ్డి మాతృమూర్తి రమణమ్మ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న సోంపేట, కంచిలి జెట్పీటీసీ ప్రతినిధులు తడక జోగారావు, ఇప్పిలి కృష్ణారావులు శుక్రవారం ఈదుపురం వెళ్లి పరామర్శించారు. రమణమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సల్ల దేవరాజు, నర్తు భాను, ఇసురు తులసీరాం పాల్గొన్నారు.

డయేరియా నివారణకు ముందస్తు చర్యలు



అవగాహన కల్పిస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

వజ్రపుకొత్తూరు: డయేరియా నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని గోవిందపురం వైద్యాధికారులు వాహినీ ప్రియాంక, డాక్టర్ వినయ్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. డయేరియా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, గ్రామీణ నీటి సరఫరా విభాగం, విద్యాశాఖ, సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛమైన తాగునీరు, చేతులు పరిశుభ్రత తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ధనలక్ష్మి, ఈఓ సన్యాశిరాజు, హెచ్‌వీ బి.తేజ్యం, ఎల్‌టీ పి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

వజ్రపుకొత్తూరు రూరల్: సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని తీసుకురావాలని ఏపీటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి కుసుమూరు వెంకటరావు కోరారు. ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా పలు పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 117 జీవోను రద్దు చేసి ప్రాథమిక పాఠశాలలో 3-5 తరగతులను నిర్వహిస్తూ ఉన్నత పాఠశాలలో సమాంతర తెలుగు మాధ్యమాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. పేద విద్యార్థుల కుటుంబాలకు ఆర్థిక భారం లేకుండా సంక్షేమంగా ప్రభుత్వం ప్రకటించిన తల్లికి వందనం ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులకు మాత్రమే వర్తింపజేయాలని కోరారు. పీఆర్సీ కమిషన్ తక్షణమే నియమించి ఐఆర్ ప్రకటించాలన్నారు.

కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం జిల్లా కౌన్సిలర్ జి.గోపాలకృష్ణ, ఆనంద బెహరా, మండల ఉపాధ్యక్షులు కె.తిరుమలకుమార్, కార్యదర్శులు కె.ఈశ్వరరావు, ఎస్.రాంబాబు, ఉదయ్‌కుమార్, హరిచంద్ర చౌదరి, కె.ప్రసాద్, షణ్ముఖరావు, రమేష్ పాల్గొన్నారు.

శతశాతం పింఛన్లు పంపిణీ చేయాలి



సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

కాశీబుగ్గ: జూలై 1న శతశాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష సిబ్బందికి సూచించారు. ఈ మేరకు పలాస మండలం శాసనాం గ్రామంలో తన నివాసంలో సచివాలయం అడ్మిన్లతో సమావేశం నిర్వహించారు. సచివాలయ ఉద్యోగులు లబ్ధిదారుల ఇళ్లకే వెళ్లి పింఛన్లు అందజేయాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషను వజ్రపుకొత్తూరు మండల బీజేపీ నేతలు తమ్మినేని విఘ్నేశం, గుంటు ధనరాజ్, కె.గోపి, టి.తారకేశ్వరరావు, బత్తిన పాపారావు తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు.

విద్యార్థులకు స్టూడెంట్ కిట్ల పంపిణీ



పలాస: కిట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్, ఉపాధ్యాయులు



ఇచ్ఛాపురం రూరల్: కిట్లు అందజేస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు

పలాస: మండలంలోని బొడ్డపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మదన్, ప్రధానోపాధ్యాయుడు ఎ.వీర్రాజు, విద్యా కమిటీ చైర్మన్ సార జోగారావు, కిక్కర ఢిల్లీరావు, ఎంపీటీసీ మద్దిల పాపారావు, పీడీ రామ్‌జీ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం రూరల్: స్టూడెంట్స్ కిట్లను విద్యార్థులు సద్వినియోగపరచుకోవాలని వైస్ ఎంపీపీ దున్న గురుమూర్తి అన్నారు. బూర్జపాడు ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రేఖారెడ్డి, గణపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: బెల్లుపడ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఏ.జీవులు, జానకిరావు, గిరీష్, శ్రీధర్, రాము, నీలవేణి, చిన్నారావు పాల్గొన్నారు.

క్యాన్సర్‌ను మొదటి దశలోనే గుర్తించాలి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సత్యస్వరూప్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)/శ్రీకాకుళం కల్చరల్: క్యాన్సర్‌ను మొదటి దశలో గుర్తిస్తే ప్రాణాంతకం కాదని రిమ్స్ వైద్యులు డాక్టర్ సత్య స్వరూప్ తెలిపారు. నగరంలోని సన్ షైన్ స్కూల్లో లైన్స్ క్లబ్ ఆఫ్ హర్షవల్లి ఆధ్వర్యంలో చైల్డ్ హుడ్ క్యాన్సర్‌పై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ గుండెపోటు తర్వాత ప్రపంచవ్యాప్తంగా అత్యధిక మరణాలకు కారణవుతున్న మహమ్మారి క్యాన్సర్ అని పేర్కొన్నారు. ఔషధాలు, చికిత్స ఉన్నప్పటికీ సకాలంలో గుర్తించకపోతే వ్యాధి ప్రాణాంతకమవుతుందన్నారు. ఆగని దగ్గు, పేగుల కదలికల్లో మార్పులు, గడ్డలు, వాపులు, పుట్టుమచ్చల్లో మార్పులు, కారణం లేకుండా బరువు తగ్గడం, తగ్గని నొప్పులు, ఆహారం మింగడానికి ఇబ్బంది పడటం, మూత్రంలో రక్తం పడటం తదితర లక్షణాలు క్యాన్సర్ వ్యాధి బారిన పడిన వారిలో కనిపిస్తాయన్నారు. చిన్నారులు బయట కాకుండా ఇంట్లో వండిన ఆహార పదార్థాలనే తీసుకోవాలని సూచించారు. ప్రతిరోజు తప్పనిసరిగా వ్యాయామం చేయాలన్నారు. కార్యక్రమంలో లైన్స్‌క్లబ్ హర్షవల్లి జోనల్ చైర్‌పర్సన్ కరణం శోభారాణి, విశ్రాంత అడిషనల్ డీఎంహెచ్ఓ లయన్ డాక్టర్ చింతాడ కృష్ణ మోహన్, ఉపాధ్యక్షులు లయన్ వావిలపల్లి జగన్నాథనాయుడు, సన్ షైన్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రదీప్, ట్రెజరర్ తర్లాడ అప్పలనాయుడు, మజ్జి సుమన్, లక్ష్మీకాంత్, మణి శర్మ, కృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

'పాత పింఛన్ విధానం అమలు చేయాలి'



ఉపాధ్యాయుల సమస్యలను వివరిస్తున్న ఆపస్ సంఘ సభ్యులు

రణస్థలం: డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పింఛన్ విధానం అమలు చేయాలని ఆపస్ జిల్లా అధ్యక్షుడు దుప్పల శివరామ్ ప్రసాద్ కోరారు. మండలంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రణస్థలం మండల కార్యవర్గ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే 117జీవో రద్దు చేయాలని, పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని, బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులను తప్పించాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ సమావేశంలో ఏపీయూఎస్ రణస్థలం మండల కమిటీని ఎన్నుకున్నారు. ఆపస్ మండల అధ్యక్షుడిగా జి.చిన్నికృష్ణం నాయుడు, ప్రధాన కార్యదర్శిగా సింగూరు రాజు, ఆర్థిక కార్యదర్శిగా బి.కుమార్, ఉపాధ్యక్షుడిగా వి.వేణుగోపాల్‌ను ఎన్నుకోవడం జరిగింది. సమావేశంలో జిల్లా కార్యదర్శులు ఎం.రవిభట్టు, జి.గిరి, ఎస్.శ్రీధర్, ఎల్.సత్యం తదితరులు ఉన్నారు.